# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో రాములు.

**రామన్నపేట జులై 17 తెలంగాణ వాణి**
రామన్నపేట మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో ఆవుల రాములు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారుల గుడిసెలను సందర్శించి ఇండ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాములు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ పనుల నాణ్యతను కాపాడుతూ నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఎన్. సునీల్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మార్వో బదిలీపై బాణాసంచా కాల్చి సంబరాలు.!

- చిగురుమామిడి మండల చరిత్రలోనే మొదటిసారి..
- అవినీతి అధికారి పోయాడంటూ బీఎస్పీ ఆధ్వర్యంలో హర్షాతిరేకాలు!

**హుస్నాబాద్:జు17 (తెలంగాణ వాణి రూరల్)**
సాధారణంగా ప్రభుత్వ అధికారులకు బదిలీ (ట్రాన్స్ఫర్) అయితే తోటి సిబ్బంది, స్థానికులు బాధపడటం లేదా ఘనంగా వీడ్కోలు పలకడం చూస్తుంటాం. కానీ, ఒక అధికారి బదిలీ అయినందుకు ప్రజలు, రాజకీయ నాయకులు రోడ్లపైకి వచ్చి, బాణాసంచా కాల్చి పండుగ చేసుకోవడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు! చిగురుమామిడి మండలంలో గురువారం సరిగ్గా ఇలాంటి వినూత్న సంఘటన ఒకటి చోటుచేసుకుంది. గతంలో సదరు అధికారి అక్రమాలపై ఎవరూ స్పందించకపోయినా, నేడు ఆయన బదిలీ కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**ఆనాడే 'తెలంగాణ వాణి' నిజాలు నిలదీసింది!**


తెలంగాణ వాణి

చిగురుమామిడి 'రెవెన్యూ'లో

అవినీతి రాజ్యం.!

- కాసులిస్తేనే ఫైల్ కదిలేది - ఇవ్వకుంటే తగ్గేదేలే..
- పైరవీకారులకు పెద్దపీట - ఒక్కో పనికి ఒక్కో 'రేటు'
- అడిగినంత ఇవ్వకుంటే ఇక అంతే...
- సామాన్యులకు తప్పని పడిగాపులు...
- గతంలోనే అనేక ఆరోపణలు...
- అయినా 'మేనేజ్' చేసుకుంటూ ఇక్కడే తిష్ట
- మంత్రి ఇలాకాలో వివాదస్పదంగా అధికారి తీరు

సదరు అధికారి హయాంలో మండలంలో సాగిన పలు అక్రమ వ్యవహారాలపై 'తెలంగాణ వాణి' పత్రిక ఆనాడే గళం విప్పి, ప్రత్యేక కథనాలతో నిజాలను నిలదీసిన సంగతి ఇక్కడ గమనార్హం. నాడు పత్రిక ఎత్తిచూపిన అక్రమాలే నేడు సదరు అధికారి బదిలీకి ప్రధాన కారణాలుగా నిలిచాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.



**అవినీతికి అడ్డాగా ఎమ్మార్వో ఆఫీస్: బీఎస్పీ నేతల ధ్వజం**

బహుజన్ సమాజ్ పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు ఎనగందుల శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మండల రెవెన్యూ కార్యాలయం ముందు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు భారీగా బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిన్న బదిలీ అయిన ఎమ్మార్వో ముద్దసాని రమేష్ తన పదవీ కాలంలో మండలంలో అడ్డగోలుగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ భూములను రిజిస్ట్రేషన్లు చేయడం, నాలా కన్వర్షన్లు మరియు ఇండ్ల అనుమతుల కోసం సామాన్యుల నుండి భారీగా లంచాలు వసూలు చేయడం లాంటి చర్యలకు సదరు అధికారి పాల్పడ్డారని వారు మండిపడ్డారు. చివరికి ఎమ్మార్వో ఆఫీసును అడ్డాగా మార్చుకుని, అర్హత లేని వారికి దొంగ పట్టాలు సృష్టించారని బాహాటంగా ధ్వజమెత్తారు. మండలాన్ని అవినీతి ముఠా నుండి రక్షించాలంటూ జరిగిన ఈ సంబరాల కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి బోయిని బాబు, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు, చిగురుమామిడి మండల అధ్యక్షుడు ఎనగందుల శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. వారితో పాటు బీఎస్పీ ముఖ్య నాయకులు జేరిపోతుల వెంకటేష్, ములుగురి సతీష్ మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.







# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభం

**రామన్నపేట, జూన్ 17: తెలంగాణ వాణి**
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే అడ్మిషన్లు పొందాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అన్ని వసతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కల్పించబడుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను వినియోగించుకొని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన కోరారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కళాశాలను సంప్రదించాలని సూచించారు.